
# కౌగిలింత శాసించిన జీవితం

- ప్రఫుల్లచంద్ర



విజయ్, వినయ్‌లది ఒకే ఊరు, ఒకే వయసు. అయితే ఒకే కంచం, ఒకే మంచం పద్ధతిలో కాకపోయినా ఇద్దరూ మంచి మిత్రులు. విజయ్ చదువుల్లో దిట్ట. వినయ్‌కి ఆటల్లో ఆసక్తి.

అదేం చిత్రమో కానీ, వాళ్లిద్దరూ పాల్గొనే ఏ పోటీలోనైనా అందరి దృష్టీ విజయ్ మీదనే. అందరి మొదటి ఎంపిక అతనే. అతడు వద్దని వదిలేస్తే అప్పుడు వినయ్‌కి ఛాన్స్.

కాలేజీలో మొదట విజయ్‌కి సీటు దొరికింది. వినయ్‌కి లేదు. ఆ తర్వాత మరింత మంచి కాలేజీలో సీటు దొరికి విజయ్ వెళ్లిపోగా ఆ ఖాళీలో వినయ్ దూరాడు. కంప్యూటర్ కోర్సు చదివేటప్పుడూ అలాగే

జరిగింది. ఉద్యోగంలోనూ అంతే. బెంగుళూరులోని ఒక కంప్యూటర్ కంపెనీ ఇంటర్వ్యూకి ఇద్దరూ వెళ్లినా విజయ్ సెలెక్ట్ అయ్యాడు. ఒక ఏడాదిలోగా అతనికి ప్రమోషన్ లభించగా ఏర్పడిన ఖాళీలో వినయ్‌ని తీసుకున్నారు. అయితే ఫస్ట్, సెకండ్ అన్న భేదం వాళ్ల స్నేహానికీ, జోక్‌లకూ ఎప్పుడూ అడ్డు రాలేదు.

విజయ్ పెళ్లి చూపులకు వెళ్తూ తనతో వినయ్‌నీ రమ్మన్నాడు. "నీవు వదిలేస్తే ఆ అమ్మాయిని నేను పెళ్లి చేసుకోవలసి వస్తుందేమో! వద్దురా!" అని జోక్ చేసినా వెళ్లక తప్పలేదు వినయ్‌కి.

మర్యాదలు బాగానే చేశారు. అమ్మాయి సుజాత అనాకారి కాదు. ఎంఎస్సీ చదివి కంప్యూటర్ కోర్సు చేసింది. విజయ్‌కి అమ్మాయి బాగా నచ్చింది కానీ, జాతకాలు కుదరలేదన్నారు అతని తల్లిదండ్రులు.

"నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోకుండా, ఈ జాతకాల పిచ్చి ఏమిట్రా? పైగా కంప్యూటర్ యుగంలోని కంప్యూటర్ ఇంజనీర్‌వి! అంత జాతకాల పిచ్చి ఉన్నవాడివి ముందుగా అమ్మాయి జాతకం తెప్పించుకుని చూడవలసింది. తీరా పెళ్లి చూపులకు వెళ్లి, మర్యాదలు చేయించుకుని తీరికగా జాతకం కుదరలేదనడం వాళ్లని అవమానించడం కాదా?" నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు వినయ్.

"నేనేదో నేరం చేసినట్టు ఏమిట్రా నీ బాధ? పోనీ ఆ అమ్మాయిని నువ్వే పెళ్లి చేసుకో!" వెటకారంగా అన్నాడు విజయ్.

అతడు వెటకారంగా అన్నా, నిజంగా అదే జరిగింది. వినయ్ సుజాతను వివాహం చేసుకుని బెంగుళూర్‌లో కాపురం పెట్టి ప్రైవేట్ కాలేజీలో భార్యకు లెక్చరర్ ఉద్యోగం సంపాదించాడు. వారి జీవితం అన్యోన్యంగా, హాయిగా సాగిపోతోంది.

జాతకాలు కుదరలేదంటూ పది సంబంధాలు తిరగగొట్టిన విజయ్ కూడా చివరకు అద్భుత జాతకవతి జానకిని వివాహం చేసుకున్నాడు. గారాంగా పెరిగిందేమో, తన మాటే చెల్లాలన్న పట్టుదల ఎక్కువే ఆమెకు. పైగా ముహూర్తాల మీద అతి నమ్మకం, వంట ప్రారంభించాలన్నా, భోజనం చేయాలన్నా, చివరకు బెడ్‌రూమ్‌లో కూడా ముహూర్తాలే.

విదేశాలకు వెళ్లి లక్షలు ఆర్జించి తిరిగొచ్చి స్వగ్రామంలో మంచి ఇల్లు కట్టుకోవాలని విజయ్ ఆశయం. వాళ్ల కంపెనీ విదేశీ శిక్షణ కోసం విజయ్‌తోబాటు మరొకర్ని ఎంపిక చేసింది కూడా. అయితే వివాహం, ఆ తర్వాత హనీమూన్, అటు తర్వాత సుముహూర్తం కుదరక ఆ అవకాశాన్ని వదులుకున్నాడు విజయ్. అతడు జారవిడిచిన వాటిని అందిపుచ్చుకునే జాతకం వినయ్‌ది. ఇతగాడు అమెరికాలో ఆరు నెలలు శిక్షణ పొంది తిరిగొచ్చి తమ కంపెనీలోనే డబుల్ ప్రమోషన్ పొంది విజయ్‌కంటే పెద్ద జీతగాడయ్యాడు.

ఎప్పుడూ సెకండ్ ఛాయిస్‌గా ఉండే వినయ్ వివాహం తర్వాత పుంజుకుని తనకంటే ముందుకు పోవడంతో జీవితంలో మొదటి ఓటమి పొందినట్టు డీలా పడిపోయాడు విజయ్. ఈలోగా అతని తండ్రి ఆరోగ్యం పాడయింది. ముహూర్తం చూడకుండా దగ్గు, ఆయాసం వచ్చేవి. వాతావరణ కాలుష్యం లేని ఊళ్లో కొన్నాళ్లు విశ్రాంతి తీసుకోమని డాక్టర్ సలహా ఇస్తే, బెంగుళూరులో కొడుకు వద్ద కొంతకాలం ఉండి ట్రీట్‌మెంట్ తీసుకోవాలని మంచి ముహూర్తం చూసుకుని మరీ ఆయన భార్యతో సహా వచ్చాడు. కానీ ఆయన కొడుకు ఇంట్లో అడుగు పెట్టగానే దుర్ముహూర్తం ఎదురైంది!

అత్తగారు రాగానే ఆమెకు కిచెన్ అప్పగించేసి తను టీవీకి అంకితం అయిపోయింది జానకి. మామగారు నర్సింగ్ హోమ్‌లో చేరితే ఆసుపత్రి కంపు నా వంటికి పడదంటూ ఒక్కసారైనా ఆ చాయలకు వెళ్లలేదామె. భార్య ప్రవర్తన విజయ్‌కి నచ్చకపోయినా ఆమెపై కోపం ప్రదర్శించడానికి అతనికి ముహూర్తం కుదరలేదు! అత్తగారితో ఎప్పుడూ పుల్లవిరుపు మాటలే గానీ, ఆత్మీయంగా మాట్లాడలేదు జానకి. కొడుకు వద్ద రెండు నెలలుందామని వచ్చిన వృద్ధ దంపతులు కోడలి ప్రవర్తన చూసి రెండువారాలకే తిరుగు ప్రయాణం అయ్యారు.

అదే సమయంలో వినయ్‌కీ ఒక సమస్య. గర్భవతి అయిన అక్కను పుట్టింటికి తీసుకురావాలి. కానీ స్వగ్రామంలో అమ్మ ఒక్కతే ఉంటోంది. అదనపు చాకిరీ చేయలేదు. తన భార్య కూడా జానకిలాగానే ప్రవర్తిస్తుందేమోనని భయపడుతూనే అమ్మను, అక్కను ఇంటికి తీసుకొచ్చాడు వినయ్. కానీ అతడు భయపడినట్టు ఏమీ జరగలేదు.


ఆడవాళ్లంతా చక్కగా కలిసిపోయారు. ఎవరికి ఏది ఇష్టమో తెలుసుకుని చక్కగా వండిపెట్టేది సుజాత. ఆడపడుచుని డాక్టర్ వద్దకూ, షాపింగ్‌లకూ తీసుకువెళ్లేది. సినిమాలూ, షికార్లూ సరేసరి.

విజయ్ తల్లిదండ్రులు బాధపడుతూ వెళ్లిపోగానే వాళ్లింటికి జానకి తల్లిదండ్రులొచ్చారు. భర్తను కూడా మరిచిపోయి జానకి తల్లిదండ్రుల సేవలో మునిగిపోయింది. సినిమాలు, షికార్లు, స్పెషల్ వంటలు, కబుర్లు, జోక్‌లతో ఇల్లు దద్దరిల్లిపోయింది.

ఇంటి ఖర్చుల కోసం ఐదువేలు, స్వంత ఖర్చుల కోసం వెయ్యీ ప్రతి నెలా జానకి కిచ్చి మిగిలిన జీతం బాంక్‌లో వేస్తాడు విజయ్. జాగ్రత్తగా ఖర్చు చేసి ఆ ఐదు వేలలో బాగానే మిగుల్చుకుంటుంది జానకి.

నెల పూర్తి కాకుండానే ఇంకా డబ్బు కావాలని అడిగింది జానకి. అత్తమామల్ని అవమానించి సాగనంపిన జానకి తన తల్లిదండ్రులకు మాత్రం అఖండ మర్యాదలు చేస్తూ ఉండడంతో కోపంగా ఉందతనికి. "నీ డబ్బు ఖర్చు పెట్టుకో!" అన్నాడు చిరాకుగా.

"జానకీ! నువ్వు నా తల్లిదండ్రుల్ని ఎలా ఆదరించావో, ఇప్పుడు నీ తల్లిదండ్రుల్ని ఎలా ఆదరిస్తున్నావో నీకూ తెలుసు; నాకూ తెలుసు. నీ



ఆదరణలో నీనా తల్లిదండ్రుల మధ్య తేడా ఉన్నప్పుడు డబ్బు విషయమూ అంతే!" కటువుగా అన్నాడు విజయ్.

కోపం వచ్చినా అప్పటికేమీ అనని జానకి భోజనాలు వడ్డిస్తూ "ఇది నా డబ్బుతో వండిన వంట!" అంది.

భోజనానికి కూర్చున్న విజయ్ ఆ మాట విని చటుక్కున లేచి వెళ్లిపోయాడు. సాయంకాలం ఆఫీసు నుంచి వచ్చాక కూడా టిఫెన్, టీ తీసుకోలేదు. "నా డబ్బుతోనే ఇంటి అద్దె కట్టాం. కనుక ఈ ఇంటిలో నేను పడుకోవచ్చనుకుంటా!" అంటూ రాత్రి భోజనం చేయకుండానే బెడ్‌రూమ్‌లో దూరి తలుపేసుకున్నాడు.

నిర్ఘాంతపోయింది జానకి. తెగేదాకా లాగకూడదన్న ఇంగితంతో మర్నాడు స్వాంత్వన కార్యక్రమం మొదలుపెట్టారు జానకి తల్లిదండ్రులు. అత్తమామల్ని గౌరవించకపోవడం తప్పే. ఏదో చిన్నపిల్ల ... రోగిష్టివాళ్లకు ఎలా సేవ చేయాలో దానికి తెలియదు అంటూ సర్దిచెప్పబోయారు.

"మీకు రోగాలొచ్చి నర్సింగ్‌హోమ్‌లో చేరినప్పుడు ఆ చాయలకు కూడా రానప్పుడు, మీ కోడల్ని చూసి అనండి ఆ మాట! మిమ్మల్ని ఒకవక్క అవమానిస్తూ, మరోవక్క తన తల్లిదండ్రులకు సకల మర్యాదలూ చేసే కోడల్ని చూసినప్పుడు అనండి ఆ మాట!" అంటూ రోషంగా బయటకు వెళ్లిపోయాడు విజయ్.

ముఖాలు వేలాడేసుకుని ఆ సాయంకాలమే జానకి తల్లిదండ్రులు వెళ్లిపోయారు. అయినా ఇంటి వాతావరణం మారలేదు.

జీతాలొచ్చాక, భార్యకు డబ్బు ఇచ్చేంతవరకూ ఇంటిలో ఏమీ తినకూడదని నిర్ణయించుకున్న విజయ్‌ని తమ ఇంటికాహ్వానించాడు వినయ్.

ఆ ఇంటిలో అడుగు పెట్టగానే ఎంతో హాయిగా అనిపించింది విజయ్‌కి. వినయ్ తల్లిని చూడగానే స్వంత అమ్మను చూస్తున్నంత తియ్యగా మనసు నిండిపోయింది. భాష తెలియని పరాయి రాష్ట్రంలో తెలిసిన ముఖం కనిపించగానే ఆమెకూ ప్రాణం లేచి వచ్చింది. విజయ్‌ని తన పక్కనే కూర్చొపెట్టుకుని సొద మొదలుపెట్టిందామె.

"నువ్వు ఫలానా వారి అబ్బాయివి కదూ! నీ పెళ్లికి రాలేకపోయానురా అబ్బాయ్! నీ పెళ్లాన్ని తీసుకురాలేకపోయావా? సరే, నేనే రేపు మీ ఇంటికొచ్చి నీ పెళ్లాన్ని చూస్తానులే! అన్నట్టు ... నువ్వు వద్దనుకుని వదిలేసిన అమ్మాయినే మా వాడు చేసుకున్నాడు కదా! హ్హా...హ...హ...!" ఎంతో ఆత్మీయంగా నవ్విందామె.

అయినా విజయ్ మనస్సు చివుక్కుమంది గొప్ప అమ్మాయిని చేసుకున్నావ్‌లే అన్న ఎత్తిపొడుపులాగా అనిపించి.

"నేనేంతో అదృష్టవంతురాలినిరా, అబ్బాయ్! ఎలాంటి కోడలు వస్తుందో, నాకింత గంజినీళ్లయినా పోస్తుందో, లేదో అని ఎంతో భయపడ్డాను. ఏ తల్లి అయినా కోరుకునేది ఏమిటి? కొడుకు సుఖంగా ఉండాలని! తన శేష జీవితం సాఫీగా సాగిపోవాలని! అంతే కదా! ఇప్పుడు నాకే బెంగా లేదు. దేవతలాంటి కోడలు దొరికింది!" మురిసిపోతూ చెప్పిందామె.

వినయ్ ఇంట్లో పూర్తిగా ఒక రోజు ఉండిపోయాడు విజయ్. మర్నాడుదయం ఆఫీసుకెళ్లడానికి చాలా టైమ్ ఉండడంతో వినయ్‌తో కబుర్లు చెబుతూ కూర్చున్నాడు.

"మీ ఇంట్లో అసలు అభిప్రాయ భేదాలు, సమస్యలు రావా?" హఠాత్తుగా అడిగాడు విజయ్.

"ఎందుకు రావు? వస్తాయి. కానీ అర్థం చేసుకునే అనుకూలవతి భార్యగా లభిస్తే సమస్యలన్నీ సవ్యంగా పరిష్కారం అయి మనశ్శాంతిగా ఉంటుంది. సుజాతకు అహంభావం లేదు. స్వార్థం లేదు. అత్తగారిని కన్నతల్లిగా, ఆడపడుచుని స్నేహితురాలిగా చూసుకునే సంస్కారం ఉంది!" అన్నాడు వినయ్ తృప్తిగా.

అతని ముఖంలో ఆనందం, గుండెల్లో ఉత్సాహం, ఇంటినిండా అనురాగం చూసి నేను వదులుకున్న అమ్మాయిని చేసుకుని వీడెంత సుఖపడిపోతున్నాడో అని మనస్సు చివుక్కుమంది.

"నీకో రహస్యం చెప్పనా?" అంటూ విజయ్‌కి దగ్గరగా జరిగాడు వినయ్. "మా జాతకాలూ కుదరలేదు. కానీ పంతులుగారితో అబద్ధం చెప్పించి అమ్మను ఈ పెళ్లికి ఒప్పించాను!" అని గలగలా నవ్వేశాడు.

"అయితే జాతకాలు ఉత్తి ట్రాష్ అంటావ్!" కోపంగా అడిగాడు విజయ్.

"అవునో, కాదో నాకూ తెలియదు. కానీ నీ నమ్మకాన్ని కాదనే హక్కు నాకు లేనట్టే నా అపనమ్మకాన్ని కాదనే హక్కు నీకూ లేదు. ఈ కంప్యూటర్ యుగంలో ఒక కంప్యూటర్ ఇంజనీర్ కొత్తగా కొన్న కంప్యూటర్‌కి బొట్టు పెట్టి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభోత్సవం చేస్తే నాకు నవ్వు వస్తుంది. భగవంతుడా, నేను చేసే ఆపరేషన్ సక్సెస్ అయితే నీ కొండకు వచ్చి తలనీలాలు సమర్పించుకుంటానని మొక్కుకుని ఆపరేషన్ చేయడానికి బయలుదేరే డాక్టర్‌ని నీవు నమ్మవచ్చు గానీ, నేను నమ్మను. ముహూర్తాలూ, జాతకాలకన్నా సుఖసంసారానికి కావలసింది అవగాహన, ఆత్మీయత, అనురాగం అని నా నమ్మకం. జాతకాలూ, ముహూర్తాలూ రాసిన కాగితం ముక్కలు జీవితాల్ని శాసించడాన్ని నేను అంగీకరించను!" అన్నాడు వినయ్.

టిఫిన్ తినడానికి రమ్మని పిలవడానికి వచ్చిన వినయ్ తల్లి చివరి మాటలు విన్నది. "నీదంతా వితండ వాదనరా అబ్బాయ్! ఎవరెలాంటివారో జాతకంలోనే రాసిపెట్టి ఉంటుందిరా! జాతకాల్లో పొంతన లేకపోతే సంసారాలు అఘోరిస్తాయి. పొంతన గల జాతకవతిని వివాహం చేసుకున్నావు కనుకనే హాయిగా ఉండి, పెద్ద కబుర్లు చెబుతున్నావ్!" అని మందలించింది.

అమ్మవైపు అర్థవంతంగా చూసి నవ్వుకున్నాడు వినయ్. ■

